సంపుటి :02 సంచిక :279 పేజీలు :06

వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

బుధవారం 15, జనవరి 2026



## పల్లె ముంగిట సంక్రాంతి సందడి..

### జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు!

తెలంగాణ లోగిళ్లలోకి సంక్రాంతి సంబరం వచ్చేసింది. సిరిధాన్యాల రాశులు, ముంగిట రంగవల్లులు, గాలిపటాల కేరింతలతో పల్లెలు పండుగ శోభను సంతరించుకున్నాయి. హరిదాసుల కీర్తనలు, బసవన్నల సవ్వడుల మధ్య అజ్ఞానపు చీకట్లను పారద్రోలుతూ ఈ పండుగ కొత్త వెలుగులు తీసుకురానుంది. చేతికందిన పంట సిరులతో కర్షకుల కళ్లలో మెరుపులు, బంధుమిత్రుల పలకరింపులతో ప్రతి ఇల్లూ వినోదాల వేదికగా మారింది. ఈ మకర సంక్రాంతి ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్య ఐశ్వర్యాలను ప్రసాదించాలని కోరుకుంటూ..

'అక్షర దర్బార్' పాఠకులకు సంక్రాంతి శుభాకాంక్షలు.



## అంతర్రాష్ట్ర దొంగల ముఠా ఆటకట్టు

- ఇళ్ల తాళాలు పగుల గొట్టి పట్టపగలు దొంగతనాలు
- పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఇద్దరు నిందితుల అరెస్ట్
- మరో నిందితుడి కోసం గాలింపు చర్యలు
- మత్తు పదార్థాలకు బానిసలై చోరీల బాట
- నిందితుల నుంచి రూ.16 లక్షల విలువైన ఆభరణాల స్వాధీనం

5



## మేడారం మహాజాతరకు అంకురార్పణ

2

వనదేవతల మహాజాతరకు మేడారం గడ్డ సిద్ధమవుతోంది. సమ్మక్క- సారలమ్మ జాతర ప్రారంభోత్సవానికి బుధవారం నిర్వహించిన 'గుడి మెలిగే' పండుగతో అంకురార్పణ జరిగింది. పూజారులు అత్యంత నియమ నిష్టలతో ఆలయాలను శుద్ధి చేసి ఈ వేడుకను నిర్వహించారు. మేడారంలోని సమ్మక్క పూజా మందిరం, కన్నెపల్లిలోని సారలమ్మ గుడిలో ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం ప్రత్యేక పూజలు చేశారు. వంశీయులు, పూజారులు డోలి వాయిద్యాల మధ్య అడవికి వెళ్లి గుట్ట గడ్డిని సేకరించి తీసుకువచ్చారు. దానికి పసుపు కుంకుమలతో పూజలు నిర్వహించిన అనంతరం ఆలయాల పైకప్పులపై అలంకరించారు. - అక్షరదర్బార్, మేడారం

## సీఎం పర్యటనకు సన్నాహాలు

- 18న మేడారానికి రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రుల రాక
- భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు
- 19న మేడారం గద్దెలు, ప్రాంగణ పునరుద్ధరణ పనుల ప్రారంభోత్సవం
- రాష్ట్ర పంచాయతీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

5





## ధాన్యం గోల్‌మాల్

- మహబూబాబాద్ జిల్లాలో నాలుగైదు రైస్ మిల్లులపై విజిలెన్స్ దాడులు
- రూ.4.86 కోట్ల విలువైన ధాన్యం పక్కదారి
- బహిరంగ మార్కెట్‌కు తరలించినట్లు ప్రాథమికంగా నిర్ధారణ
- మిల్లులను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని, లైసెన్సులు రద్దుచేయాలని సివిల్ సప్లైకి సిఫార్సు

2

మహబూబాబాద్ జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ధాన్యం భారీగా పక్కదారి పట్టింది. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ కొందరు మిల్లర్లు అక్రమ దందాకు పాల్పడ్డారు. ఈ భారీ కుంభకోణాన్ని తాజాగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తన తనిఖీల్లో బట్టబయలు చేసింది. జిల్లాలో సుమారు రూ.4.86 కోట్ల విలువైన ధాన్యం మాయమైనట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. పేదలకు పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని అక్రమ మార్గాల్లో తరలిస్తున్నట్లు తనిఖీల్లో వెల్లడైంది. నిఘా వర్గాల సమాచారంతో విజిలెన్స్ బందాలు ఏకకాలంలో జిల్లాలోని నాలుగైదు రైస్ మిల్లుల్లో ఆకస్మిక దాడులు నిర్వహించాయి. ఈ తనిఖీల్లో నిల్వ ఉండాల్సిన ధాన్యానికి, రికార్డులకు పొంతన లేకపోవడంతో అధికారులు విస్తుపోయారు.

– అక్షరదర్బార్, మహబూబాబాద్



# ధాన్యం గోల్‌మాల్

- మహబూబాబాద్ జిల్లాలో రైస్ మిల్లులపై విజిలెన్స్ దాడులు
- రూ.4.86 కోట్ల విలువైన ధాన్యం పక్కదారి
- బహిరంగ మార్కెట్ కు తరలించినట్లు ప్రాథమికంగా నిర్ధారణ
- మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టాలని, లైసెన్సులు రద్దుచేయాలని సివిల్ సప్లయ్ కి సిఫార్సు

**అక్షరదర్బార్, మహబూబాబాద్ :**

మహబూబాబాద్ జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ధాన్యం భారీగా పక్కదారి పట్టింది. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ కొందరు మిల్లర్లు అక్రమ దందాకు పాల్పడ్డారు. ఈ భారీ కుంభకోణాన్ని తాజాగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తన తనిఖీల్లో బట్టబయలు చేసింది. జిల్లాలో సుమారు రూ.4.86 కోట్ల విలువైన ధాన్యం మాయమైనట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. పేదలకు పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని అక్రమ మార్గాల్లో తరలిస్తున్నట్లు తనిఖీల్లో వెల్లడైంది. నిఘా వర్గాల సమాచారంతో విజిలెన్స్ బృందాలు ఏకకాలంలో జిల్లాలోని నాలుగైదు రైస్ మిల్లుల్లో ఆకస్మిక దాడులు నిర్వహించాయి. ఈ తనిఖీల్లో నిల్వ ఉండాల్సిన ధాన్యానికి, రికార్డులకు పొంతన లేకపోవడంతో అధికారులు విస్తుపోయారు.

**బహిరంగ మార్కెట్ కు మళ్లింపు**

రైతుల నుంచి ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని బియ్యంగా మార్చాల్సిన మిల్లర్లు.. ఆ ధాన్యాన్ని బహిరంగ మార్కెట్లో విక్రయించుకున్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని మిల్లుల్లో వేలాది క్వింటాళ్ల ధాన్యం నిల్వలు కనిపించకుండా పోవడంతో విజిలెన్స్ అధికారులు లెక్కలు తీశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మిల్లుల్లో ఉండాల్సిన నిల్వలు లేకపోవడంతో అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ లక్ష్యాలకు గండి కొడుతూ కోట్ల రూపాయల విలువైన ధాన్యాన్ని మళ్లించిన మిల్లర్లపై క్రిమినల్ చర్యలకు రంగం సిద్ధం చేశారు.

**స్టాక్ లో భారీ వ్యత్యాసం**

కేవలం ధాన్యం మాయం చేయడమే కాకుండా, రికార్డుల్లో తప్పుడు లెక్కలు చూపి అధికారులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరిగినట్లు విజిలెన్స్ డీజీ శిఖా గోయల్ వెల్లడించారు. ప్రభుత్వం ఖరీఫ్ సీజన్లో రికార్డు స్థాయిలో ధాన్యం సేకరిస్తుంటే, క్షేత్ర స్థాయిలో కొందరు మిల్లర్లు సిండికేట్‌గా మారి ఈ దందా సాగిస్తున్నట్లు అనుమానిస్తున్నారు. జిల్లాలోని మిల్లుల్లో స్టాక్ రిజిస్టర్లను, భౌతిక నిల్వలను పరిశీలించినప్పుడు భారీ వ్యత్యాసాలు బయటపడ్డాయి. ప్రజా పంపిణీ వ్యవస్థకు అందాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టించి సొమ్ము చేసుకుంటున్న వైనంపై అధికారులు లోతైన విచారణ జరుపుతున్నారు.

**లైసెన్సుల రద్దుకు సిఫార్సు**

విజిలెన్స్ అధికారులు అక్రమాలకు పాల్పడిన మిల్లుల లైసెన్సులను రద్దు చేయాలని పౌరసరఫరాల శాఖకు సిఫార్సు చేశారు. సదరు మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టి, వారి నుంచి ధాన్యం రికవరీ చేయాలని సూచించారు. తనిఖీల సమయంలో రికార్డులను సరిగా చూపని మిల్లులకు నోటీసులు జారీ చేశారు. అక్రమాల్లో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక దాడులు మిల్లింగ్ రంగంలో తీవ్ర కలకలం రేపుతున్నాయి. రైతులు ఇలాంటి అక్రమాలను గుర్తిస్తే టోల్ ఫ్రీ నంబర్ 14432కు సమాచారం ఇవ్వాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.



## మేడారం మహాజాతరకు
# అంకురార్పణ

**- భక్తిశ్రద్ధలతో గుడి మెలిగే పండుగ**

అక్షరదర్బార్, మేడారం : వనదేవతల మహాజాతరకు మేడారం గద్దె సిద్ధమవుతోంది. సమ్మక్క– సారలమ్మ జాతర ప్రారంభోత్సవానికి బుధవారం నిర్వహించిన 'గుడి మెలిగే' పండుగతో అంకురార్పణ జరిగింది. పూజారులు అత్యంత నియమ నిష్టలతో ఆలయాలను శుద్ధి చేసి ఈ వేడుకను నిర్వహించారు. మేడారంలోని సమ్మక్క పూజా మందిరం, కన్నెపల్లిలోని సారలమ్మ గుడిలో ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం ప్రత్యేక పూజలు చేశారు. వంశీయులు, పూజారులు డోలి వాయిద్యాల మధ్య అడవికి వెళ్లి గుట్ట గడ్డిని సేకరించి తీసుకువచ్చారు. దానికి పసుపు కుంకుమలతో పూజలు నిర్వహించిన అనంతరం ఆలయాల పైకప్పులపై అలంకరించారు.వనదేవతల పూజా సామాగ్రిని శుద్ధి చేసి అందంగా తీర్చిదిద్దారు. ఆలయాల ఆవరణలో ముగ్గులు వేసి ప్రవేశ మార్గాల్లో మామిడి తోరణాలు కట్టి ముస్తాబు చేశారు. మేడారంలో కొక్కెర కృష్ణయ్య, సిద్దబోయిన మునేందర్, కన్నెపల్లిలో కాక సారయ్య, కిరణ్ తదితర పూజారుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు వైభవంగా జరిగాయి. జాతర నిర్వహణలో 'గుడి మెలిగే' పండుగను అంకురార్పణగా భావిస్తే, ఈ నెల 21న జరిగే 'మండ మెలిగే' పండుగను తొలి అంకంగా పరిగణిస్తారు. జాతర విజయవంతంగా సాగాలని కోరుతూ పూజారులు వనదేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు.

**- ఇతర ప్రాంతాల్లోనూ...**

మహబూబాబాద్ జిల్లా పూనుగొండ్లలోని పగిడిద్దరాజు దేవాలయం, ములుగు జిల్లాలోని ఏటూరునాగారం మండలం కొండాయిలోని గోవిందరాజుల ఆలయాల్లో కూడా పూజారులు మండమెలిగే పండుగను నిర్వహించారు. జాతర తేదీలు దగ్గరపడుతుండటంతో మేడారానికి భక్తుల తాకిడి విపరీతంగా పెరిగింది. బుధవారం కూడా వేలాది మంది భక్తులు తరలివచ్చి వనదేవతలకు ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారు. గద్దెల ప్రాంగణంలో క్యూలైన్లు, రాతి శిలలపై ఆకృతుల ఏర్పాటు వంటి అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీసులు ట్రాఫిక్ నిబంధనలను కఠినతరం చేశారు. ప్రైవేట్ వాహనాలను పస్రా, నార్లాపూర్, కన్నెపల్లి మీదుగా జంపన్నవాగు దాటగానే ఏర్పాటు చేసిన ప్రత్యేక పార్కింగ్ స్థలాల్లో నిలిపివేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. మేడారం సర్పంచ్ సిద్దబోయిన భారతి వెంకన్నతో పాటు పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మరికొద్ది రోజుల్లోనే కోట్లాది మంది భక్తులతో మేడారం అడవి జనసంద్రం కానుంది.



# పల్లె పాలకవర్గాలకు శుభవార్త

- 15 వ ఆర్థిక సంఘం నిధులపై స్పష్టత
- రూ.2,500 కోట్ల విడుదలకు గ్రీన్ సిగ్నల్
- ఈనెలాఖరులో రూ.వెయ్యి కోట్లు విడుదల
- వచ్చే నెలలో మిగిలిన నిధులు విడుదలయ్యే అవకాశం




అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి :

పల్లె పాలకవర్గాలకు శుభవార్త కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కేంద్రం నుంచి అందాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు రావాల్సిన రూ. 2,500 కోట్ల బకాయిల్లో భాగంగా ఈ నెలాఖరు లోపు రూ.వెయ్యి కోట్లు విడుదల చేసేందుకు కేంద్రం పచ్చజెండా ఊపింది. మిగిలిన నిధులను వచ్చే నెలలో విడతల వారీగా అందించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందింది. ఈ నిధుల రాకతో గ్రామాల్లో నిలిచిపోయిన అభివృద్ధి పనులకు మోక్షం లభించనుంది.

**- ప్రత్యేక బ్యాంకు ఖాతా తెరవాల్సిందే..**

నిధుల వినియోగం విషయంలో పారదర్శకత కోసం పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కఠినమైన మార్గదర్శకాలను జారీ చేసింది. ప్రతి గ్రామ పంచాయతీ ఈ నిధుల కోసం ప్రత్యేక బ్యాంకు ఖాతాను నిర్వహించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ఖాతాను పీఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేసి ప్రత్యేక ఏజెన్సీ కోడ్ పొందాలని జిల్లాలకు పంపిన మెమోలో పేర్కొంది. నిధుల డ్రా చేసే ప్రక్రియను పూర్తిగా డిజిటల్ మయం చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పంచాయతీల ఆర్థిక లావాదేవీల నిర్వహణలో ఇకపై ఈ–గ్రామ్ స్వరాజ్ పోర్టల్ కీలకం కానుంది. ఇందులో బ్యాంకు వివరాలను నమోదు చేయడంతో పాటు సర్పంచ్, ఉపసర్పంచ్‌లు చెకర్, మేకర్‌లుగా వ్యవహరించాల్సి ఉంటుంది. వీరిద్దరి డిజిటల్ సంతకాలను తప్పనిసరిగా పోర్టల్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఎంపీడీఓల ఆమోదం పొందిన తర్వాతే ఈ డిజిటల్ సంతకాల ద్వారా నిధుల వినియోగానికి అవకాశం ఉంటుంది.

**- మూడు డిజిటల్ సిగ్నేచర్లు అవసరం**

ప్రక్రియ కోసం క్లాస్–3 స్థాయి డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్లను వాడాలని మార్గదర్శకాలు స్పష్టం చేస్తున్నాయి. నిధుల దుర్వినియోగానికి తావులేకుండా సైనింగ్, ఎన్‌క్రిప్షన్ సౌకర్యాలతో కూడిన యూఎస్‌బీ టోకెన్లను వినియోగించాలని ప్రభుత్వం సూచించింది. పంచాయతీరాజ్ కమిషనర్ శ్రుతి ఓజా ఈ మేరకు అన్ని జిల్లాల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అవసరమైన డిజిటల్ సంతకాలను జీఈఎం పోర్టల్ లేదా ఇతర టెండర్ విధానాల ద్వారా సేకరించాలని సూచించారు. అన్ని ప్రక్రియలు పూర్తి చేసుకున్న గ్రామ పంచాయతీలకు మాత్రమే ఈ నిధులు నేరుగా అందుతాయి. డిజిటల్ సంతకాల నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. కేంద్రం నుంచి నిధులు అందిన వెంటనే గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు వీటిని వెచ్చించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.




# ఆదర్శ గ్రామం అలియాబాద్

- పండుగలతో పరిమళించే సొంత ఊరు
- ఎక్కడున్నా పండుగలంటే అలియాబాద్ కే పయనం







అక్షర దర్బార్, పరకాల : పరకాల మండలం లోని అలియాబాద్ గ్రామం పండుగల వేళ ఒక కళాఖండంలా మారిపోతుంది. సంప్రదాయం, సంస్కృతి, ఐక్యత, అనుబంధాలకు చిరునామాగా నిలుస్తూ అలియాబాద్ గ్రామం ఆదర్శ గ్రామంగా వెల్లువిరుస్తోంది. ఆధునిక జీవనశైలిలో గ్రామాలు తమ సంప్రదాయాలను కోల్పోతున్న ఈ కాలంలోనూ అలియాబాద్ గ్రామం మాత్రం పూర్వీకుల ఆచారాలను గౌరవిస్తూ ముందుకు సాగుతోంది.గ్రామంలో వినాయక చవితి, దసరా, దీపావళి, సంక్రాంతి వంటి ప్రధాన పండుగలు ఎంతో ఘనంగా నిర్వహించబడుతాయి. ప్రతి పండుగకు ముందుగానే గ్రామమంతా శుభ్రత, అలంకరణలతో కళకళలాడుతుంది. పిల్లల ఆనందం, పెద్దల ఉత్సాహం, యువత ఉర్రూతలూగే కార్యక్రమాలతో పండుగ వాతావరణం ఉప్పొంగిపోతుంది.

## ఇలవేల్పు ఎల్లమ్మ తల్లిపై అపార భక్తి

అలియాబాద్ గ్రామానికి ఇలవేల్పుగా నిలిచిన శ్రీ ఎల్లమ్మ తల్లి పండుగ (బోనాలు) గ్రామస్తుల మనసుల్లో ప్రత్యేక స్థానం కలిగి ఉంది. ఏటా భక్తి శ్రద్ధలతో నిర్వహించే ఎల్లమ్మ పండుగ సందర్భంగా మహిళలు బోనాలతో తల్లి దర్శనానికి తరలివస్తారు. డప్పు చప్పుళ్లు, భక్తిగీతాలు, ఊరేగింపులతో గ్రామం భక్తి రసంతో మునిగిపోతుంది. ఈ పండుగ గ్రామ ఐక్యతకు ప్రతీకగా నిలుస్తోంది.

## పండుగల కోసం సొంతూరికే పయనం

గ్రామంలో నివసిస్తున్న వారికంటే బయట ప్రాంతాల్లో దేశాలలో ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉండటం విశేషం. అయినా ప్రతి ఒక్కరికీ అలియాబాద్‌లో సొంత ఇల్లు ఉండటం గ్రామంపై వారి అనుబంధాన్ని తెలియజేస్తోంది. పండుగలు వస్తే చాలు ఎక్కడ ఉన్నా కుటుంబ సభ్యులతో కలిసి సొంత ఊరికి చేరుకోవడం ఆనవాయితీగా మారింది. పండుగల సమయంలో గ్రామం జనసంద్రమవుతుంది. ఎన్నాళ్ల తర్వాత కలుసుకునే బంధువులు, స్నేహితులతో గ్రామం మళ్లీ పాత రోజుల జ్ఞాపకాలను గుర్తు చేస్తుంది. సొంత ఊరిలో పండుగలు జరుపుకోవడం వారికి ఒక మధురానుభూతిగా మారుతోంది.

## కలిసిమెలిసి పండుగల సందడి

అలియాబాద్ గ్రామస్తులు ప్రతి పండుగను కుల మతాలకు అతీతంగా కలిసిమెలిసి నిర్వహించుకుంటా రు. ప్రతి ఇంటి ముందు దీపాలు, రంగవల్లులు, పం డుగ శుభాకాంక్షలతో గ్రామమంతా కనులవిందుగా మారుతుంది. గ్రామ పెద్దలు మార్గదర్శకులుగా నిలుస్తూ, యువత సేవాభావంతో ముందుకు వస్తూ పండుగల నిర్వహణలో భాగస్వాములవుతారు.

## ఆదర్శానికి చిరునామా

సంప్రదాయం–సంస్కృతి–ఐక్యత అనే మూడు స్తంభాలపై నిలబడి ఉన్న అలియాబాద్ గ్రామం నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తోంది. పండుగల ద్వారా అనుబంధాలను బలపరుస్తూ, గ్రామీణ సంస్కృతిని సజీవంగా నిలుపుతున్న ఈ గ్రామం నిజంగా ఒక ఆదర్శ గ్రామమనే చెప్పాలి. పండుగల వేళ అలియాబాద్ గ్రామం కేవలం ఒక ఊరు కాదు.. అది ఒక అనుభూతి.. అది ప్రతి అలియాబాద్ వాసి గుండెల్లో నిలిచే భావం.

# శాయంపేటలో చెక్కుల పంపిణీ



అక్షర దర్బార్, శాయంపేట: పేద ప్రజల సంక్షేమమే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శాయంపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో 57 మంది లబ్ధిదారులకు రూ.57,06,612 విలువైన కల్యాణలక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులు, అలాగే వివిధ గ్రామాలకు చెందిన 32 మందికి రూ.10,50,000 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. అంతకు ముందు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన శాశ్వత ఆధార్ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్ఎస్ఆర్ సంస్థల అధినేత సంపత్ రావు,మాజీ ఎంపీపీ, & వేజెస్ బోర్డు మెంబర్ బాసాని చంద్ర ప్రకాష్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారపల్లి రవీందర్,మాజీ జడ్పీటీసీ చల్లా చక్రపాణి,సర్పంచ్ చింతల ఉమ రవిఫాల్,గజ్జి ఐలయ్య నాయకులు చిందం రవి పాల్గొన్నారు.

# బీజేపీ జిల్లా కోశాధికారిగా ఎర్ర రామన్న నియామకం



అక్షర దర్బార్, పరకాల: సంఘటన్ పర్వ్ 2025–26లో భాగంగా తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు రాంచంద్ర రావు ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లాకు సంబంధించిన నూతన జిల్లా కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి ప్రకటించారు. ఈ కార్యవర్గంలో పరకాల పట్టణానికి చెందిన బిజెపి నాయకులు ఎర్ర రామన్నను జిల్లా కోశాధికారిగా నియమించారు. ఈ సందర్భంగా ఎర్ర రామన్న మాట్లాడుతూ పార్టీ పటిష్టత, అభివృద్ధి కోసం సర్వదా కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డితో పాటు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు , మాజీ మేయర్ రాజేశ్వర్ రావు, మాజీ జిల్లా అధ్యక్షులు రావు పద్మ, దొంతి దేవేందర్ రెడ్డి, ఎడ్ల అశోక్ రెడ్డి, కొండేటి శ్రీధర్, పరకాల కాంటెస్టెంట్ ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు,  బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తి రెడ్డి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్. విజయ చందర్ రెడ్డి, డాక్టర్. సిరంగి సంతోష్ కుమార్, కాచం గురు ప్రసాద్, గుజ్జ సత్యనారాయణ రావు తదితర జిల్లా, నియోజకవర్గ, పట్టణ బిజెపి నాయకులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

# ఈనెల 19 నుంచి సర్పంచ్ లకు శిక్షణ

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: నూతనంగా ఎన్నికైన సర్పంచులకు రాష్ట్ర ప్రభుత్వం శిక్షణ తేదీలను ఖరారు చేసింది జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని 248 మంది సర్పంచ్లకు ఈనెల 19వ తేదీ నుండి వచ్చేనెల 21వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది ఇటీవల నూతనంగా ఎంపికైన సర్పంచులలో 80% మంది నూతనంగా ఎంపికైన వారు కావడంతో వారికి గ్రామంలో పాలన పట్ల మరియు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే నిధుల వినియోగం తదితర లాంటి అంశాలపై జిల్లాలోని సర్పంచులకు నాలుగు దశలవారీగా శిక్షణ ఇవ్వనున్నట్లు బుధవారం ప్రభుత్వం జీవో విడుదల చేసింది

# వైభవంగా గోధా రంగనాథుల కళ్యాణం

## పాల్గొన్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి



అక్షర దర్బార్, భూపాలపల్లి : భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సుభాష్ కాలనీలో ఉన్న రామాలయంలో ధనుర్మాసం సందర్భంగా నిర్వహించిన గోధా రంగనాధుల కళ్యాణం వేద మంత్రాల నడుమ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా జడ్పీ మాజీ ఛైర్పర్సన్, భూపాలపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ముఖ్య అతిథిగా పాల్గొని కళ్యాణాన్ని వీక్షించారు. సింగరేణి భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ రాజేశ్వర్ రెడ్డి–సునీత దంపతులు కూడా హాజరయ్యారు. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించిన కళ్యాణ కార్యక్రమాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో వీక్షించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# జర్నలిస్టుల అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం

**–తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ (ఎన్ యూజే–ఐ)**

అక్షరదర్బార్, భూపాలపల్లి : సీనియర్ జర్నలిస్టులు దొంతు రమేష్, చారి, సుధీర్‌లను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ (ఎన్‌యూజే–ఐ) తీవ్రంగా ఖండించింది. ఈ అరెస్టులు మీడియా స్వేచ్ఛపై నేరుగా దాడి అని టీఎస్‌జేయూ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పావుశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తడుక సుధాకర్, జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సంతోష్, జిల్లా ప్రధాన కార్యదర్శి దొమ్మటి రవీందర్ పేర్కొన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ, జర్నలిస్టులను అరెస్ట్ చేయడం ద్వారా ప్రభుత్వాన్ని ప్రశ్నించొద్దని, కథనాలు రాస్తే జైలుకెళ్లాల్సి వస్తుందనే సందేశం ఇవ్వాలనే ప్రయత్నంగా ఈ చర్యలు కనిపిస్తున్నాయన్నారు. ఏ అంశంపై కథనం వచ్చినా నిజానిజాలపై విచారణ జరపాల్సిందే కానీ, ఆ విషయాన్ని వెలుగులోకి తెచ్చిన జర్నలిస్టులపై కేసులు పెట్టడం ప్రజాస్వామ్య విరుద్ధమని స్పష్టం చేశారు. జర్నలిస్టులపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించి, అరెస్టయిన వారిని నిరుపాధికంగా విడుదల చేయాలని యూనియన్ డిమాండ్ చేసింది.



# సీఎం పర్యటన ఏర్పాట్లపై మంత్రి సీతక్క ఫోకస్

అక్షర దర్బార్, ములుగు : ఈ నెల 18న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారానికి రానున్న నేపథ్యంలో జాతర పనుల పురోగతిని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బుధవారం గద్దెల ప్రాంగణం చుట్టూ జరుగుతున్న ల్యాండ్‌స్కేపింగ్ పనులను పరిశీలించిన మంత్రి, ఆదివాసీ–గిరిజన సంప్రదాయాలు ప్రతిబింబించేలా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఔషధ వన మూలికలు, ఇప్పపువ్వు వంటి సంప్రదాయానికి ప్రాధాన్యమైన మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. అలాగే సమీపంలో నిర్మాణంలో ఉన్న క్యూ లైన్ కాంప్లెక్స్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ అధికారులను మంత్రి ఆదేశించారు. భక్తుల సౌకర్యాలే ప్రథమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పీ రామ్‌నాథ్ కేకన్, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ గోదారంగనాథ స్వామి కళ్యాణ మహోత్సవం



అక్షరదర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని రామాలయంలో ధనుర్మాసం సందర్భంగా భోగి పండుగ రోజున శ్రీ గోదారంగనాథ స్వామి కళ్యాణ మహోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు చిట్టి రెడ్డి సమ్మక్క తెలిపినట్లు, అర్చకులు రమేష్ ఆచార్యులు సుప్రభాత సేవతో ప్రారంభించి విశ్వక్సేన, ఆరాధన, పుణ్యవచనం, కన్యాదానం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కళ్యాణాన్ని కమనీయంగా జరిపించారు. కళ్యాణం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# క్రీడాకారులకు దుస్తుల పంపిణీ



అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల గ్రామ క్రికెట్ క్రీడాకారులకు పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ బుధవారం క్రీడా దుస్తులు బహూకరించారు. క్రీడాకారులకు క్రీడా దుస్తులు లేవన్న విషయం తెలుసుకున్న వెంటనే ఎస్సై స్పందించి దుస్తులు అందజేయడం పట్ల క్రీడాకారులు ఆనందం వ్యక్తం చేస్తూ, కృష్ణ ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# భూపాలపల్లి అభివృద్ధే లక్ష్యం

**–ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



అక్షర దర్బార్, భూపాలపల్లి : భూపాలపల్లి మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని 25వ వార్డు కారల్ మార్క్స్ కాలనీలో వివిధ అభివృద్ధి పనులకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్‌తో కలిసి ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తోందన్నారు. రోడ్ల విస్తరణ, సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ, తాగునీటి సౌకర్యాలు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం వంటి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులు నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. అనంతరం పుల్లూరిరామయ్యపల్లిలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో 25వ వార్డు అధ్యక్షుడు కిషోర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు మహేందర్ రెడ్డి, దాట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# పల్లెల్లో సంక్రాంతి వేడుకలు

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మూడు రోజుల ముచ్చటైన సంక్రాంతి పండుగను ప్రజలు ఆనందోత్సహాల మధ్య జరుపుకుంటున్నారు. మొగుళ్ళపల్లి మండలంలోని 26 గ్రామాల్లో పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించుకున్నారు. కొత్త సంవత్సరంలో మకర సంక్రాంతి వేడుకలు అంబురాన్నంటాయి. వలస పోయినవారు, బంధువులు, ఆడపడుచులు, కొత్త అల్లుల్ల రాకతో ఎక్కడ చూసినా సందడి నెలకొంది. బుధవారం మొదటి రోజు భోగి సందర్భంగా మహిళలు, యువతులు సంప్రదాయాలు ఉట్టిపడేలా వారి ఇళ్ళ ముందు ముగ్గులు వేశారు. యువకులు, పిల్లలు గాలి పటాలు ఎగరవేశారు. రైతులు ఎడ్లను అలంకరించి బండ్ల ప్రదర్శనలు నిర్వహించారు. తమకు భోగభాగ్యాలు ప్రసాదించాలని ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

# బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

**హాజరైన మాజీ ఎమ్మెల్యే గండ్ర**



అక్షర దర్బార్, భూపాలపల్లి : భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు వేశాలపల్లిలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో అడ్వకేట్ వేషాల రవీందర్ స్వంత ఖర్చులతో ఏర్పాటు చేసిన నీటి ట్యాంకును ఆయన ప్రారంభించారు. అనంతరం ముగ్గుల పోటీల్లో గెలుపొందిన ఇప్పకాయల మనస్వినికి ప్రథమ బహుమతి రూ. 5,016, పొట్ల రజనికి ద్వితీయ బహుమతి రూ. 3,016, నల్ల మౌనికకు తృతీయ బహుమతి రూ. 2,016 అందజేశారు. నియోజకవర్గ ప్రజలందరికీ గండ్ర వెంకట రమణా రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఇలాంటి కార్యక్రమాలు మన సంప్రదాయాలను కాపాడుతాయని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# ఎల్లమ్మ గుడికి గంటలు బహూకరణ

**అందజేసిన సర్పంచ్ తౌటం లక్ష్మి అంతయ్య**

అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల మండల కేంద్రంలోని ఎల్లమ్మ గుడికి సర్పంచ్ తౌటం లక్ష్మి అంతయ్య గంటలు బహూకరించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం అధ్యక్షుడు బుర్ర లక్ష్మణ్ గౌడ ఆధ్వర్యంలో సర్పంచ్ తౌటం లక్ష్మి అంతయ్య, ఉప సర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ, నాలుగవ వార్డు సభ్యుడు తౌటం నవీన్‌లను ఘనంగా సన్మానించారు. గుడి కోసం గంటలు బహూకరించినందుకు గౌడ సంఘం తరఫున సర్పంచ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు గుర్రపు రాజు, ప్రేరుమండ్ల రవీందర్, గాజర్ల మల్లేష్, కట్టగాని రామ్‌చందర్, బుర్ర శ్రీనివాస్, బుర్ర కృష్ణ, బుర్ర మొండయ్య, శ్రీపతి సమ్మయ్య, మంద దర్శనం, బుర్ర రమేష్, గాజర్ల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# గీత కార్మికుడి కుటుంబానికి అండగా గౌడ సంఘం

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు గుర్రపు గట్టయ్య మూడు సంవత్సరాల క్రితం తాటి చెట్టు ఎక్కుతూ ప్రమాదవశాత్తు కింద పడటంతో వెన్నుపూస విరిగి మంచానికే పరిమితమయ్యాడు. దిక్కుతోచని స్థితిలో ఉన్న గట్టయ్య కుటుంబానికి గౌడ సంఘం అండగా నిలిచింది. గౌడ సంఘం ఆధ్వర్యంలో గట్టయ్య కుటుంబానికి రూ.1 లక్ష ఆర్థిక సహాయాన్ని బుధవారం చిట్యాల గౌడ సొసైటీ అధ్యక్షుడు బుర్ర లక్ష్మణ్ గౌడ్, డైరెక్టర్లతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ గౌడ్ మాట్లాడుతూ.. ఈ సంఘటన దురదృష్టకరమని పేర్కొంటూ, ప్రభుత్వపరంగా గీత కార్మికులకు భద్రతా పరికరాలు అందిస్తున్నట్లు తెలిపారు. గట్టయ్య పరిస్థితిని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వం నుంచి మరింత ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పెరుమండ్ల రాజు, డైరెక్టర్లు రాజు, నరేష్ తదితర గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.





## ఐలోని మల్లన్న బ్రహ్మోత్సవాల్లో మంత్రి కొండా

- ఎమ్మెల్యే నాగరాజుతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు

అక్షరదర్బార్, ఐనవోలు : భోగి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలో ఉన్న ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు హాజరైన మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే నాగరాజుకు ఆలయ ప్రధాన అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఐనవోలు జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్టాండ్‌ను మంత్రి కొండా సురేఖ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం తెలంగాణకే కాక దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ప్రాచీన శైవక్షేత్రమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్ రావు, ఆలయ కమిటీ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, ఆలయ ఈవో సుధాకర్ అధికారులు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర దొంగల ముఠా ఆటకట్టు

- ఇళ్ల తాళాలు పగుల గొట్టి పట్టపగలు దొంగతనాలు
- పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఇద్దరు నిందితుల అరెస్ట్
- మరో నిందితుడి కోసం గాలింపు చర్యలు
- మత్తు పదార్థాలకు బానిసలై చోరీల బాట
- నిందితుల నుంచి రూ.16 లక్షల విలువైన ఆభరణాల స్వాధీనం

**అక్షరదర్బార్, హనుమకొండ :**

వరంగల్ జిల్లాలో పట్టపగలే ఇళ్ల తాళాలు పగలగొట్టి దొంగతనాలకు పాల్పడుతున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. సీసీఎస్, కేయూసీ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో ఈ ముఠా గుట్టు రట్టయింది. ముఠాలో ముగ్గురు నిందితులు ఉండగా, ఒకరు పరారీలో ఉన్నాడు. పోలీసులు వీరిలో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చర్యలు ముమ్మరమయ్యాయి. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ బుధవారం వివరాలు వెల్లడించారు. సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత పర్యవేక్షణలో అడిషనల్ డీసీపీ క్రైమ్ బాలస్వామి, ఏసీపీ క్రైమ్ సదయ్య, హనుమకొండ ఏసీపీ ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో స్పెషల్ టీం రంగంలోకి దిగి నిందితుల





కోసం గాలింపు జరిగింది. పశ్చిమ బెంగాల్లోని ముర్షిదాబాద్ జిల్లాకు చెందిన ఫెరోజ్ షేక్, సుక్ చంద్, యామీన్ అనే ముగ్గురు నిందితులు ముఠాగా ఏర్పడి ఈ నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. వీరి నుంచి రూ. 16 లక్షల విలువైన 15 తులాల బంగారు నగలు, 5.5 తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా సభ్యులు మద్యం, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలకు బానిసలై జల్సాల కోసం దొంగతనాల బాట పట్టారు. గతంలో వీరు పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్రల్లో అనేక చోరీలకు పాల్పడి జైలుకు కూడా వెళ్లారు. కేవలం రెండు నెలల క్రితమే పశ్చిమ బెంగాల్ జైలు నుంచి విడుదలైన నిందితులు ఈసారి తెలంగాణలో దొంగతనాలు చేయాలని పథకం వేశారు. హన్మకొండకు చేరుకున్న ఈ ముఠా డిసెంబర్ 17న పరిమళ కాలనీ, సప్తగిరి కాలనీల్లోని రెండు ఇళ్లలో చోరీలకు పాల్పడింది. నిందితులు ఈ నెల 10వ తేదీన మరోసారి హనుమకొండకు వచ్చి గోపాలపురం శివసాయి కాలనీలోని ఒక ఇంట్లో పట్టపగలే తాళం పగలగొట్టారు. బీరువాలో ఉన్న 15 తులాల బంగారు నగలు, వెండి వస్తువులను అపహరించారు. వరుస దొంగతనాలపై ఫిర్యాదులు అందడంతో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. సాంకేతిక పరిజ్ఞానం సాయంతో నిందితుల ఆచూకీ సేకరిస్తున్న క్రమంలో కేయూసీ జంక్షన్ వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతున్న వీరిని పోలీసులు పట్టుకున్నారు. పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించిన నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు. ప్రస్తుతం వీరిలో ఫెరోజ్ షేక్ అనే నిందితుడు పరారీలో ఉండగా మిగిలిన వారిని విచారిస్తున్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనపరిచిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, కేయూసీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఐటీ కోర్ టీం సల్మాన్ పాషా, ఇతర సిబ్బందిని పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు.

# స్థూపం రంగు మార్పుపై దుమారం..!

- జనశక్తి నేత గుట్టన్న స్మారక స్థూపానికి ఆకుపచ్చ రంగు
- 'ఆదివాసీ అమరుల స్థూపం'గా మంత్రి సీతక్క నామకరణం
- విప్లవోద్యమ నేత స్థూపం రంగు ఎలా మారుస్తారని విప్లవ గ్రూపుల అభ్యంతరం

**అక్షరదర్బార్, మేడారం:**

మేడారం మహాజాతర ముంగిట జంపన్నవాగు సమీపంలోని విప్లవ స్మారక స్థూపం రంగు మార్పు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పస్రా నుంచి నార్లాపూర్ మీదుగా మేడారం వెళ్లే దారిలో ఊరట్టం క్రాస్ వద్ద దశాబ్దాలుగా ఎరుపు రంగులో నిలిచిన ఈ స్థూపానికి అధికారులు ఇటీవల సరికొత్త రంగులు వేశారు. స్థూపం దిగువన నాలుగు భాగాల్లో ఆకుపచ్చ రంగు వేసి చివరి భాగంలో మాత్రం ఎరుపు రంగును ఉంచారు. ఆదివాసీ అమరుల త్యాగానికి గుర్తుగా ఉన్న ఈ కట్టడంపై సుత్తి కొడవలి చిహ్నం అలాగే ఉన్నప్పటికీ రంగు మార్చడంపై కొన్ని వామపక్ష పార్టీలు, వివిధ ప్రజా సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. జనశక్తి పార్టీ నాయకుడు గుట్టన్న అలియాస్ మల్యాల సమ్మన్న స్మారకార్థం నిర్మించిన ఈ స్థూపం విప్లవోద్యమ నేపథ్యాన్ని కలిగి ఉంది. ఎన్ కౌంటర్‌లో మరణించిన సమ్మన్న జ్ఞాపకార్థం గతంలో దీనిని నిర్మించగా జంక్షన్ల సుందరీకరణలో భాగంగా ఇప్పుడు దీనికి 'ఆదివాసీ అమరుల స్థూపం'గా నామకరణం చేశారు. అయితే ఎర్రని రంగులో ఉండాల్సిన విప్లవ గుర్తులకు ఆకుపచ్చ రంగు పూయడం త్యాగాలను అవమానించడమేనని వామపక్ష గ్రూపులు వాదిస్తున్నాయి. విప్లవ చైతన్యానికి ప్రతీకగా ఉన్న స్థూపాల రూపురేఖలను మార్చడం వెనుక రాజకీయ ఆంతర్యం ఉందని వారు ఆరోపిస్తున్నారు.

### - మంత్రి సీతక్క ఇలాకాలో

ఈ వివాదం ఇప్పుడు స్థానిక ఎమ్మెల్యే, మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఇలాకాలో జరగడం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. తాను విప్లవోద్యమం నుంచి వచ్చానని, ఆదివాసీ బిడ్డనని చెప్పుకునే మంత్రి నియోజకవర్గంలో ఇలా స్థూపం రంగు మారడంపై భక్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. గతంలో సీతక్క స్వయంగా జనశక్తి పార్టీలో పనిచేసిన నేపథ్యం ఉండటంతో ఆమె పర్యవేక్షణలోనే ఈ మార్పులు జరగడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీతక్కకు తెలియకుండా మేడారంలో చిన్న మార్పు కూడా జరగదని నమ్మే పరిస్థితుల్లో ఈ పరిణామం హాట్ టాపిక్‌గా మారింది. ఒకప్పుడు ఈ ప్రాంతంలో విప్లవోద్యమం బలంగా ఉన్న సమయంలో రాత్రికి రాత్రే ఇటువంటి



స్థూపాలు వెలిసేవని స్థానికులు గుర్తు చేసుకుంటున్నారు. నాటి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం మావోయిస్టులతో జరిపిన చర్చల సమయంలో ఈ నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నెత్తుటి స్మరణకు పచ్చని పూతలు పూయడంపై సామాజిక మాధ్యమాల్లో కూడా భిన్నమైన చర్చ జరుగుతోంది. అడవికి ప్రతీకగా పచ్చ రంగు వేశామని కొందరు చెబుతుంటే విప్లవ చరిత్రను కప్పిపుచ్చే ప్రయత్నం ఇదని వామపక్ష సంఘాలు మండిపడుతున్నాయి.

# సీఎం పర్యటనకు సన్నాహాలు

- 18న మేడారానికి రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రుల రాక
- 19న మేడారం గద్దెలు, ప్రాంగణ పునరుద్ధరణ పనుల ప్రారంభోత్సవం
- వివరాలు వెల్లడించిన మంత్రి సీతక్క

అక్షరదర్బార్, మేడారం : ఈ నెల 18న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు మేడారానికి రానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై బుధవారం మేడారం హరిత హోటల్‌లో ఆమె జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, జిల్లా ఎస్పీ రామ్‌నాథ్ కేకన్, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్ తో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి మేడారం చేరుకున్న అనంతరం ఇక్కడే బస చేయనున్నారని, 19న శ్రీ సమ్మక్క సారలమ్మ గద్దెలు, ప్రాంగణ పునరుద్ధరణ పనుల ప్రారంభోత్సవం చేస్తారని తెలిపారు. 18న రాష్ట్ర స్థాయి యంత్రాంగం మొత్తం మేడారంలోనే ఉండనున్నందున, ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని అధికారులను కోరారు. 18 ఆదివారం కావడం, పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ముగియడంతో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని, ఆ దృష్టితో ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు మహేందర్ జీ, సంపత్ రావు, ఆర్డీఓ వెంకటేష్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.






# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

## ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!

## మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915